క్లుప్తంగా

సీఎంను కలిశారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మిద్దెల హరి

శ్రీకాళహస్తి: తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితోపాటు మిద్దెల హరి కలిశారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డిని కూడా కలిసి సన్మానించారు.

విరివిగా 'ఉపాధి' పనులు

ఏర్పేడు: ఉపాధి హామీ కూలీలకు విరివిగా పనులు కల్పించాలని ఎంపీడీఓ గిడ్డయ్య ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అంజిమేడులో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు.కూలీలకు రోజూ రూ.272 వచ్చేలా పనుల్లో కొలతలు ఇవ్వాలన్నారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులను గుర్తించి వారికి ఉపాధి హామీలో బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు గీతాంజలి, కూలీలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా చెంచులక్ష్మి, యమున

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల, బీఎన్‌కండ్రిగ అంగన్‌వాడీ క్లస్టర్ సూపర్‌వైజర్‌గా చెంచులక్ష్మి, నెలవాయి క్లస్టర్ సూపర్‌వైజర్‌గా యమున నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్లు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో వీరు ఇక్కడికి వచ్చారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

శ్రీకాళహస్తి: 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 11కేవీ లైన్ల నెలవారీ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి, కేవీబీ పురం, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తిరుపతి రూరల్ ట్రాన్స్‌కో ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పిచ్చాటూరు: మండలంలో సబ్ స్టేషన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత : ఒకరి అరెస్ట్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పెద్దపాలేడు గ్రామం వద్ద శుక్రవారం లగేజీ ఆటోలో తరలిస్తున్న 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు.

రేణుకా ఎల్లమ్మకు పొంగళ్లు



పొంగళ్లు తీసుకువెళుతున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ రేణుకా ఎల్లమ్మ ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, అర్జున్ నాయుడు, మునిరత్నం నాయుడు, వెంకటరమణారెడ్డి, సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

కారిపాకంలో ఆగిన ఉపాధి పనులు

వరదయ్యపాళెం: అక్రమాలకు పాల్పడిన కారిపాకం ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిపై వారం క్రితం ఆ శాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో రెండు వారాల నుంచి కారిపాకం గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు ఆగిపోయాయి. సీనియర్ మేట్లతో పనులు చేయించడానికి తిరుపతి నుంచి అవరోధాలు ఎదురవుతున్నాయి. పనులకు వెళ్లరాదంటూ బెదిరిస్తున్నాడని కూలీలు వాపోతున్నారు. మరోవైపు అధికారులు పట్టించుకోకపోవడం, అక్రమాలకు పాల్పడిన వ్యక్తి గురించి పనులు ఆపివేయడంపై కూలీలు మండిపడుతున్నారు. పనులు కొనసాగించాలని కోరుతున్నారు. ఎంపీడీఓ నివేదిక ఆధారంగా తిరుపతిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీనిపై ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు వివరణ కోరగా.. స్థానికంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని, అయితే అతనినే కొనసాగించాలని కొందరు కోరారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిని కొనసాగించలేమని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయంగా మరొకరిని ఏర్పాటు చేసి పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

ముక్కంటి పాలకమండలి సమావేశం వాయిదా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సమావేశం వాయిదా వేసినట్లు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరగాల్సిన పాలకమండలి సమావేశం ఈఓ సాగర్‌బాబు స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

బైపాస్ రోడ్డు నిర్మాణంతో సమగ్రాభివృద్ధి

- సర్వే పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిమూలం



కస్తూరినాయుడు కండ్రిగలో బైపాస్ రోడ్డు భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణంతో పిచ్చాటూరు, నాగలాపురం సరిహద్దు ప్రాంతాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం దాసుకుప్పం బైపాస్ రోడ్డు సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో భూముల విలువ పెరగడంతో పాటు వ్యాపార, వాణిజ్య పరంగా అభివృద్ధి చెంది స్థానికులకు జీవనోపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదే సమయంలో నియోజకవర్గ ప్రజలు తమిళనాడు భూభాగంతో అవసరం లేకుండా వెళ్లవచ్చన్నారు. బైపాస్ రోడ్డు భూ నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు శ్రీ పల్లికొండేశ్వరాలయం చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎస్ఎం సురేష్, పిచ్చాటూరు నాయకులు పాల పద్మనాభం, తొప్పయ్య రెవెన్యూ, ఆర్అండ్‌బీ ఏఈ ఇజ్రాయెల్, రెండు మండలాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఉత్సవాలు

వరదయ్యపాళెం: గ్రామస్థాయిలో జరిగే ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని చెదులపాకం, వరదయ్యపాళెంలోని వడ్డిపాళెంలో నూతన శ్రీవెంకటేశ్వరాలయం, అంకాల పరమేశ్వరి ఆలయాల్లో నిర్వహించిన కుంభాభిషేక మహోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగత పలికి పూజలు చేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, బీఎన్‌కండ్రిగ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, యూత్ కన్వీనర్ వినోద్‌యాదవ్, ఎస్సీ సెల్ కన్వీనర్ బందిల సురేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్పంచులు రమణయ్య, వేణు, కిషోర్, గిరిరెడ్డి, కరుణాకర్‌నాయుడు, ఎస్ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలో తిమ్మభూపాలపురం అరుంధతివాడలోని మాతమ్మ కొలుపును శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాతమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి, అంబలి పోసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, నాయకులు సంజీవయ్య, మంగయ్య, యుగంధర్‌రెడ్డి, చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.



వడ్డిపాళెంలో అంకాలమ్మ ఆలయ కుంభాభిషేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

విజ్ఞాన శిబిరాలతో నైపుణ్యాలు పెంపు



విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల



తొట్టంబేడు : బహుమతులు అందుకున్న విద్యార్థులతో చైర్‌పర్సన్

సత్యవేడు: ప్రభుత్వ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో పిల్లలు నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనారు మధుబాల అన్నారు. శుక్రవారం సత్యవేడు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆమె పరిశీలించారు. డ్రాయింగ్, వ్యాసరచన, యోగా, పేపర్ క్రాఫ్ట్ తదితర పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ఆమె మాట్లాడారు. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు పిల్లలను సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచి పుస్తక పఠనం వైపు మరలించేందుకు చొరవ చూపాలన్నారు. లైబ్రరీలో పిల్లల నుంచి వృద్ధుల వరకు అవసరమైన పుస్తకాలు, గ్రంథాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉన్నాయన్నారు. విద్యార్థులు విజ్ఞాన సముపార్జనకు రోజూ గ్రంథాలయానికి రావడం ఒక వ్యాపకంగా మలచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జీ. ప్రసాద్, ఉపాధ్యాయులు ఎం ఎం.శివప్రసాద్,క్రిష్ణకిషోర్,విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల ప్రతిభ వెలికితీత కోసమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల అన్నారు. శుక్రవారం ఏర్పేడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. శాఖా గ్రంథాలయ అధికారిణి మునిరాజమ్మ, ప్రజా ప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): విద్యార్థులు తరచూ గ్రంథాలయాలకు వస్తూ పుస్తక పఠనం అలవరచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనారు మధుబాల అన్నారు. తొట్టంబేడు శాఖా గ్రంథాలయం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం పొందాలని కోరారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఏ.హరిక్రిష్ణ ,ఉపాధ్యాయులు జి.రమణయ్య, పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం



కరపత్రాలు చూపుతున్న సిరాజ్‌బాషా, ముస్లింలు

శ్రీకాళహస్తి: మైనార్టీల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన మసీదులకు వెళ్లి ముస్లింలను కలిశారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి కరపత్రాలు అందజేసి వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింల కోసం 4శాతం రిజర్వేషన్ అమలు చేసి మేలు చేశారన్నారు. ఆయన తనయుడుగా జగనన్న ముస్లింలకు సామాజిక భద్రత, నవరత్నాలు వర్తించేలా చేశారన్నారు. పేద ముస్లిం కుటుంబాలకు వైఎస్ఆర్ షాదీ తోఫా, హజ్ మక్కాయాత్రకు చేయూతనిస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మైనార్టీలకు ఇంతగా చేసింది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మక్కా మసీద్ ముతవల్లి ఇలియాస్ హుస్సేన్, సభ్యులు షేక్ మీర్జాన్‌సా, షేక్ ఉస్మాన్, మత పెద్దలు అబ్దుల్ కలాం, షేక్ ఖాదర్ బాషా, మహమ్మద్ ఖాలిద్, షేక్ లాల్ బాషా, షేక్ బషీర్, షేక్ షాను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు ఎస్సీ కాలనీలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం నగదును శుక్రవారం సర్పంచ్ మోహనప్రియ అందజేశారు. వివరాలు..ఎండీపుత్తూరు ఎస్సీ కాలనీకి చెందిన కుక్క అమ్ములు(36) గుండెపోటుతో రెండు రోజుల క్రితం మృతి చెందింది. సర్పంచ్ బాధిత కుటుంబంతో వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేయడంతో ప్రభుత్వం నుంచి రూ.లక్ష మంజూరైంది. పంచాయతీ ఖాతాకు తక్షణ సాయం కింద రూ.10 వేలు జమచేసింది. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి లోకముని, వెల్ఫేర్ అసిస్టెంట్ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం ..శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. పూడి క్రాస్ వద్ద రికార్డులు లేకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు మునిరెడ్డి, మాధవయ్య, చెంచయ్యపై కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు







విరాళం అందజేస్తున్న మౌలేశ్వరరావు, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, ఏర్పేడు : విరాళం ఇస్తున్న జనార్ధన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం గుంటూరు విశాఖనగర్‌కు చెందిన యార్లగడ్డ మౌలేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.3,26,254, నెల్లూరుకు చెందిన ఆర్.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.50వేలు వేర్వేరుగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు దాతలకు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఆలయ సతీష్ మాలిక్, నాగభూషణం నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయానికి..

ఏర్పేడు: మండలంలోని నాగంపల్లిలో నూతనంగా నిర్మించనున్న దేశమ్మ ఆలయానికి దుర్గిపేరి గ్రామానికి చెందిన కైలాసం జనార్దన్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, బాబురెడ్డి ఆలయ కమిటీకి రూ.75 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసారెడ్డి, మునిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, కిరణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం చల్లపాలెం సచివాలయం పరిధిలోని చటర్జీ నగర్, చల్లపాళెం దళితవాడ, అరుంధతివాడలో శనివారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

బడి ఈడు పిల్లలను పనిలో పెడితే చర్యలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భీమారావు

రేణిగుంట: బడి ఈడు పిల్లలను పనికి పంపించినా, ఎవరైనా పనిలో పెట్టుకున్నా చర్యలు తప్పవని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలన వారోత్సవాలను పురస్కరించుకుని ప్రగతి సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం తన కార్యాలయంలో ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. 14 ఏళ్ల లోపు వారంతా బాలబాలికలేనని, అలాంటి వారిని పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు కూడా అవగాహనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ, కో–ఆర్డినేటర్లు తులసీరామ్‌రెడ్డి, జయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని తన కార్యాలయం వద్ద డీఎస్పీ భీమారావు శుక్రవారం బాలకార్మిక వ్యతిరేక మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వీధి బాలలను బడిలో చేర్పించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. 14 ఏళ్ల లోపు బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీచైల్డ్ గ్రూప్ చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దారు హనుమాన్‌నాయక్

బుచ్చినాయుడుకండ్రిగ: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన వారికి ఎంతో పుణ్యం లభిస్తుందని తహసీల్దారు హనుమాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుత్రిలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 80 మంది గర్భిణులకు వైద్యాధికారిణి మాధవి, వైద్యులు దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి గర్భిణులు వచ్చారు. వారితోపాటు సహాయకులకు ప్రసాద్‌నాయుడు, బొద్రావేణు, మున్నెయ్యనాయుడు, కోటేశ్వరరావు భోజన సదుపాయం కల్పించారు. తహసీల్దార్, డీటీ శివయ్య, వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం వారికి వడ్డించారు. గర్భిణులు భోజనం లేకుండా పస్తులతో వెళ్తున్నట్టు తెలుసుకుని భోజన ఏర్పాటు చేసినట్లు దాతలు తెలిపారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

– డీఎస్పీ భవ్యకిషోర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్

రేణిగుంట: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. మండలంలోని ఎల్లమండ్యం పద్మనగర్‌లో ఆమె గ్రామస్తులకు సమావేశం నిర్వహించారు. పోలీసు శాఖకు సంబంధించి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో ఏమైనా పెండింగ్ కేసులున్నాయా..? అని ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ, ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా గంజాయి, అక్రమ మద్యం, కోడిపందేలు, పేకాట.. ఇత్యాది వాటి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, యువతులు ఆపద సమయంలో దిశ యాప్‌ను ఉపయోగించి రక్షణ పొందాలన్నారు. సమావేశంలో రేణిగుంట రూరల్ సీఐ సుబ్బరాయుడు, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి పాల్గొన్నారు

జేపీ నడ్డా బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, బీజేపీ ఎంపీ, పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా శనివారం పట్టణంలోని భేరివారి మండపం వద్ద భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత తొమ్మిదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అందించిన సుపరిపాలన గురించి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సభావేదికగా వివరిస్తారన్నారు. రాష్ట్రం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరివిగా నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. రైల్వే, రహదారుల, విద్య, వైద్యం ఆర్థిక వ్యవస్థ తదితర రంగాల్లో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో ప్రజల వద్దకు తీసుకెళుతామన్నారు. జేపీ నడ్డా సాయంత్రం 5 గంటలకు సభలో ప్రసంగించనున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రులు అమిత్ షా, మురళీధరన్ కూడా రాష్ట్రంలో పర్యటించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, నాయకులు కోలా ఆనంద్, మేళగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, చంద్రప్ప, గరికపాటి రమేష్‌బాబు, గోపాల్, వెంకటేశ్వర్లు, కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లీకుమార్, వెంకటేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.